క్లుప్తంగా

'ఆడుదాం ఆంధ్రా' గొప్ప అవకాశం

జి.కొండూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ఆడుదాం ఆంధ్రా' కార్యక్రమం గ్రామీణ క్రీడాకారులకు తమ ప్రతిభను కనబర్చేందుకు గొప్ప అవకాశమని ఎంపీడీఓ అనురాధ అన్నారు. ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా మండలస్థాయి క్రీడా పోటీలు బుధవారం నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో జి.కొండూరులో సన్నాహక ర్యాలీని అధికారులు మంగళవారం నిర్వహించారు.

ఘనంగా ఫాతిమాబేగం జయంతి

తిరువూరు: తొలి భారత ముస్లిం మహిళా ఉపాధ్యాయిని ఫాతిమా బేగం జయంతి కార్యక్రమాన్ని స్థానిక సేంట్ ఆన్స్ స్కూల్లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆంధ్ర భాషోపాధ్యాయ సంఘ కన్వీనర్ రాంప్రదీప్, ఉపాధ్యాయులు ఫాతిమా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయినిగా బేగం ఆదర్శజీవితం గడిపారని, మహిళా అక్షరాస్యత కోసం పాటుపడ్డారని రాంప్రదీప్ పేర్కొన్నారు.

పెనుగొలనులో..

పెనుగొలను(గంపలగూడెం): గంపలగూడెం మండలం పెనుగొలనులో మంగళవారం షిరిడీ సాయిబాబా సేవా కమిటీ ఆధ్వర్యంలో భారతదేశ మొదటి మహిళా ముస్లిం ఉపాధ్యాయురాలు షేక్‌ఫాతిమా జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్ర పటానికి పూల మాలవేసి నివాళులర్పించారు.

విస్సన్నపేటలో..

విస్సన్నపేట: మహిళల విద్యాభివృద్ధికి కృషి చేసిన మహిళా ఉపాధ్యాయురాలు ఫాతిమా జయంతి స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద దళిత బహుజన ఐక్యవేదిక నాయకులు ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. తొలుత నాయకులు ఫాతిమా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

పోలవరంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర

చాట్రాయి: మండలంలోని పోలవరంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ దుర్గా ప్రసాదు, వైద్యాధికారి శ్రీనివాసరెడ్డి, బీజేపీ నాయకులు ఆర్‌కే రంగారావు, ఆదిమూలపు సురేష్ రాజా, ఆముదాల ఇస్సాక్ పాల్గొన్నారు.

ఎస్టీయూ మండల శాఖ అధ్యక్షుడిగా వేణుగోపాలరావు

ఆగిరిపల్లి: ఎస్టీయూ ఆగిరిపల్లి మండల శాఖ అధ్యక్షుడిగా ఈదర జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు మక్కే వేణుగోపాలరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యదర్శిగా అమ్మవారి గూడెం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు వంశీకృష్ణ, మహిళా కార్యదర్శిగా రజియా బేగం, గౌరవాధ్యక్షునిగా ఆర్.వెంకటేశ్వరావు ఎన్నికయ్యారు.

నేడు ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి పోటీలు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): ఇబ్రహీంపట్నం మండల పరిషత్, కొండపల్లి మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి క్రీడా పోటీలు బుధవారం నుంచి ప్రారంభమవుతాయని ఎంపీడీఓ రామకృష్ణనాయక్ ఒక ప్రకటనలో మంగళవారం తెలిపారు. కొండపల్లి డీఏవీ పాఠశాలలో నిర్వహించే పోటీలను ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ ప్రారంభిస్తారని పేర్కొన్నారు.

ముసునూరు: బుధవారం నుంచి మండల స్థాయిలో 'ఆడుదాం ఆంధ్రా' క్రీడా పోటీలు ప్రారంభించనున్నట్లు ఎంపీడీఓ జి.రాణి తెలిపారు. మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ముసునూరు హైస్కూల్లో జరగనున్న కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్ డబుల్స్ పోటీలకు సచివాలయాల స్థాయిలో ఎంపికైన క్రీడాకారులంతా సకాలంలో హాజరుకావాలని పేర్కొన్నారు.

హుండీ ఆదాయం రూ.2.6 లక్షలు

విస్సన్నపేట: స్థానిక గంగాపార్వతి సమేత చంద్రశేఖరస్వామి దేవస్థానంలో భక్తులు స్వామికి సమర్పించిన హుండీ కానుకలను మంగళవారం ఎండోమెంట్ ఈఓ ఏ వైష్ణవి సమక్షంలో లెక్కించినట్లు ఆలయ ఈఓ సీతారామయ్య తెలిపారు. ఆరు నెలలకు గాను రూ.2,66,221ల ఆదాయం వచ్చినట్లు ఈఓ పేర్కొన్నారు.

జగన్ పాదయాత్రకు ప్రజల హృదయాల్లో సుస్థిరస్థానం

ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు



నూజివీడులో దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్‌అప్పారావు

నూజివీడు: రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన పాదయాత్ర చారిత్రాత్మకమని, అది ప్రజల హృదయాల్లో నిలిచిపోయిందని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. జగన్ పాదయాత్ర ముగించి ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా పట్టణంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో మంగళవారం వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్రపటానికి ఎమ్మెల్యే ప్రతాప్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పాదయాత్ర చేసి అన్ని వర్గాల ప్రజల కష్టసుఖాలను తెలుసుకుని అధికారంలోకి రాగానే వారి సమస్యలను పరిష్కరిస్తూ వారి కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. ఎన్నికల సమయంలో ప్రకటించిన మ్యానిఫెస్టోలో పేర్కొన్న హామీలన్నింటినీ అమలు చేసి చూపించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనన్నారు. సచివాలయాలను ఏర్పాటు చేసి ప్రభుత్వ పాలనను ప్రజల వద్దకు తీసుకొచ్చిన ఘనత సీఎం జగన్‌దేనన్నారు. సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ప్రజల గుండెల్లో నిలిచిపోయారన్నారు. ప్రతిపక్షాలు ఎన్ని కుయుక్తులు పన్నినా ప్రజల గుండెల్లో ఉన్న జగన్‌మోహన్‌రెడ్డిని ఏమీ చేయలేరన్నారు. టీడీపీ అధికారంలోకి రావడం కల్ల అని, పగటి కలలు కనడం టీడీపీ నాయకులు మానుకోవాలన్నారు. పనిచేసే ప్రభుత్వం వైఎస్ జగన్ ప్రభుత్వమన్నారు. రాబోయే ఎన్నికల్లో కూడా ప్రజలు జగన్‌మోహన్‌రెడ్డికి పట్టం కట్టడం ఖాయమన్నారు. జెడ్పీ వైస్ చైర్మన్ గుడిమళ్ల కృష్ణంరాజు, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు శీలం రాము, ముసునూరు మండల అధ్యక్షుడు మూల్పూరి నాగవల్లేశ్వరరావు, నాయకులు వినయ్, మున్నా, పూర్ణిమ, మున్సిపల్ వైస్ చైర్మన్ వెంకటేశ్వరరావు, సుగుణరావు పాల్గొన్నారు.

పాదయాత్రతో ప్రజా సమస్యల పరిష్కారం

చాట్రాయి: పాదయాత్ర స్ఫూర్తితో ప్రజా సమస్యలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిష్కరిస్తున్నారని మండల పరిషత్ ఉపాధ్యక్షుడు పుచ్చకాయల సుబ్బారెడ్డి స్పష్టం చేశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్ర చేసి ఐదు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా చాట్రాయిలో మంగళవారం కేక్ కట్ చేశారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మిద్దె బాలకృష్ణ, వైఎస్సార్ సీపీ నాయకులు అర్జున, వాసు, రాజు, సత్యనారాయణ, రమేష్ పాల్గొన్నారు.

ప్రజా సంకల్ప యాత్ర చరిత్రాత్మకం

ఆగిరిపల్లి: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన ప్రజాసంకల్ప యాత్ర చరిత్రాత్మకమని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పల్లగాని నరసింహారావు అన్నారు. ప్రజాసంకల్ప యాత్ర జరిగి ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా ఆగిరిపల్లిలో మంగళవారం వేడుకలు నిర్వహించారు. కేక్ కట్ చేసి నాయకులు, అభిమానులు, కార్యకర్తలకు పంపిణీ చేశారు. జెడ్పీటీసీ సభ్యుడు పిన్నిబోయిన వీరబాబు, జిల్లా వక్ఫ్ బోర్డు సభ్యుడు షేక్ సుభాని, మండల ఉపాధ్యక్షుడు రవిశేఖర్, పార్టీ నాయకులు ఇస్సాకు, నాగుల్ మీరా, శ్రీమన్నారాయణ, పార్టీ గ్రామ అధ్యక్షుడు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నాటి పాదయాత్రతోనే నేటి సంక్షేమ పథకాలు

ముసునూరు: నాడు జగనన్న చేసిన ప్రజా సంకల్ప పాదయాత్రతోనే మహత్తర సంక్షేమ పథకాలు రూపుదిద్దుకుని, నేడు స్వర్ణయుగం దిశలో రాష్ట్రం పరుగులు తీస్తోందని నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు నాగవల్లేశ్వరరావు ఆధ్వర్యంలో స్థానిక సర్పంచ్ కంచర్ల వాణి అధ్యక్షతన జగనన్న ప్రజా సంకల్ప పాదయాత్ర ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా వార్షికోత్సవ వేడుకలను మంగళవారం గోపవరంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన కేక్ కట్ చేశారు. ఎంపీపీ కొండా దుర్గాభవాని, జెడ్పీటీసీ సభ్యుడు డాక్టర్ వరికూటి ప్రతాప్, వైస్ ఎంపీపీలు రాజానాయన, గంగాధర్, స్టేట్ హిస్టరీ అకాడమీ డైరెక్టర్ పి.స్వరూపరాణి, స్థానిక సొసైటీ అధ్యక్షుడు కె.గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నంలో..

ఇబ్రహీంపట్నం: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గతంలో చేపట్టిన ప్రజా సంకల్పయాత్రకు ఐదేళ్లు పూర్తయ్యాయి. ఇబ్రహీంపట్నంలో వైఎస్సార్ సీపీ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద కేక్ కట్‌చేసి స్వీట్లు పంచారు. శక్తి నగర్ వరకు ర్యాలీ నిర్వహించి వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర సహాయ కార్యదర్శి, పీఏసీఎస్ చైర్మన్ మునగాల శివారెడ్డి, సచివాలయాల కో-ఆర్డినేటర్ లంకె అంకమోహనరావు పాల్గొన్నారు.



గోపవరంలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే వెంకట ప్రతాప్ అప్పారావు



ఇబ్రహీంపట్నంలో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించిన నాయకులు



చాట్రాయిలో కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



ఆగిరిపల్లిలో కేక్ కట్ చేస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు వీరబాబు

అయోధ్య రామయ్య అక్షింతల పంపిణీ



తిరువూరు: రాష్ట్రీయ స్వయం సహాయక్ ఆధ్వర్యంలో తిరువూరు పట్టణంలో మంగళవారం అయోధ్య రాముడి స్పర్శ అక్షింతలను ఇంటింటికీ పంపిణీ చేశారు. అశోక్‌నగర్, ఆర్టీసీ కాలనీలలో 200 కుటుంబాలకు అక్షింతలు పంపిణీ చేసినట్లు ఆర్ఎస్ఎస్ సభ్యులు దేవిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, చెన్నోజు శ్రీనివాసాచారి, సేకు నాగేశ్వరరావు తెలిపారు. అయోధ్య రామాలయం ప్రారంభోత్సవ ఆహ్వానాలను కూడా అందజేశారు.

పుల్లూరులో..

పుల్లూరు(మైలవరం): మైలవరం మండలం పుల్లూరు శివారు చిలుకూరువారిగూడెంలో అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలతో సోమవారం రాత్రి గ్రామోత్సవం నిర్వహించినట్లు స్థానిక రామాలయం భక్త కమిటీ సభ్యులు ప్రకటనలో తెలిపారు. చిలుకూరువారిగూడెం రామాలయం నుంచి గ్రామోత్సవం నిర్వహించి, ఇంటింటికీ అక్షింతలు పంపిణీ చేశారు.

ప్రాంగణ ఎంపికలను సద్వినియోగం చేసుకోవాలి

విస్సన్నపేట: కళాశాలలో వివిధ కంపెనీలు నిర్వహిస్తున్న ప్రాంగణ ఎంపికలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని వికాస్ విద్యాసంస్థల చైర్మన్ నరెడ్ల నర్సిరెడ్డి అన్నారు. స్థానిక వికాస్ ఫార్మసీ కళాశాల్లో హైదరాబాద్‌కు చెందిన దివీస్ ల్యాబొరేటరీస్ ఆధ్వర్యంలో ప్రాంగణ ఎంపికలు మంగళవారం నిర్వహించారు. ఈ ఎంపికలకు 93 మంది విద్యార్థులు హాజరు కాగా 33 మంది ఎంపికైనట్లు నర్సిరెడ్డి తెలిపారు. ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.శ్రీనివాసరావు, దివీస్ ల్యాబోరేటరీ హెచ్‌ఆర్ మేనేజర్ రామకృష్ణయ్య, అధ్యాపకులు డాక్టర్ పి.వెంకట్, డాక్టర్ మాధవి పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో పేదలకు వైద్య సేవలు



చాట్రాయి మండలం నరసింహారావుపాలెంలో మందుల కిట్‌ను అందజేస్తున్న సుబ్బారెడ్డి



జి.కొండూరు మండలం గంగినేని గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం

ముసునూరు: జగనన్న ఆరోగ్య సురక్షతో పేదలకు ఆరోగ్య సేవలు అందుతున్నాయని నూజివీడు ఎమ్మెల్యే వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా గోపవరం సచివాలయం-1 ప్రాంగణంలో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యాధికారు లు అవినాష్, షకీనా ఇవాంజిలిన్, ప్రత్యేక వైద్య ని పుణుడు ప్రవీణ్, చర్మ వైద్య నిపుణురాలు ధన్యశ్రీ 580 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. ఎంపీపీ దుర్గాభవాని వెంకట్రావు, జెడ్పీటీసీ సభ్యుడు డాక్టర్ వరికూటి ప్రతా ప్, వైస్ ఎంపీపీలు రాజానాయన, గంగాధర్, సొసైటీ అధ్యక్షుడు కె.గోపాలకృష్ణ, స్టేట్ హిస్టరీ అకాడమీ డైరెక్టర్ స్వరూపరాణి, సర్పంచ్ వాణి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు నాగవల్లేశ్వరరావు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నంలో..

ఇబ్రహీంపట్నం: ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష పథకం పేదలకు వరం లాంటిదని ఎంపీడీఓ రామకృష్ణనాయక్ పేర్కొన్నారు. మండలం పరిధిలో తుమ్మలపాలెం, ఈలప్రోలు గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు మంగళవారం జరిగాయి. ఆయా గ్రామాల సర్పంచ్‌లు బొమ్ము వెంకటరమణ, కరణం రంగారావు, ఎంపీటీసీ సభ్యురాలు కె.జయమ్మ పాల్గొన్నారు.

చాట్రాయిలో..

చాట్రాయి: ప్రజలంతా ఆరోగ్యంగా ఉండాలనేదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయమని మండల పరిషత్ ఉపాధ్యక్షుడు పుచ్చకాయల సుబ్బారెడ్డి తెలిపారు. మండలంలోని నరసింహారావుపాలెం వెల్‌నెస్ సెంటర్లో మంగళవారం నిర్వహించిన జగనన్న సురక్ష వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. అనంతరం రోగులకు మందుల కిట్లను అందజేశారు. ఉప సర్పంచ్ మందపాటి రఘుపతిరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు శీతయ్య, వెంకటరెడ్డి, వైద్యులు దుర్గా ప్రసాదు, జ్యోతి, సుప్రియ, శ్వేత పాల్గొన్నారు.

434 మందికి వైద్య పరీక్షలు

జి.కొండూరు: మండలంలోని గంగినేని గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వైద్య శిబిరంలో 434 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులను పంపిణీ చేసినట్లు మండల వైద్యాధికారి డాక్టర్ శిరీష తెలిపారు. ఎంపీటీసీ సభ్యుడు పిల్లి ప్రసాద్, పీఏసీఎస్ చైర్మన్ వెంకట్రావు, డాక్టర్ శ్వేత ల్గొన్నారు.

ఇంటి వద్దకే వైద్య సేవలు


మైలవరం: పేదల సంక్షేమమే ధ్యేయంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పనిచేస్తుందని సర్పంచ్ గరికపాటి మంజుభార్గవి తెలిపారు. మైలవరం 6వ వార్డులో మదర్‌థెరీసా హాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమం మంగళవారం జరిగింది. ఎంపీడీఓ లక్ష్మీకుమారి, చంద్రాల పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ ప్రియాంక, డాక్టర్ సునీల్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వసంతకు ఉరుసు ఉత్సవాల ఆహ్వానం



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి షాబుఖారీ దర్గా 427వ ఉరుసు మహోత్సవాలు పురస్కరించుకుని ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్‌కు ముస్లిం పెద్దలు ఆహ్వానం పలికారు. ఎమ్మెల్యేను ఐతవరంలో ఆయన నివాసంలో దర్గా పీఠాధిపతి మహ్మద్ అల్తాఫ్‌రజా, ముస్లిం పెద్దలు మంగళవారం కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ నెల 21, 22వ తేదీల్లో నిర్వహించనున్న ఉరుసు మహోత్సవాల్లో పాల్గొని షాబుఖారీ బాబా ఆశీస్సులు పొందాలని కోరారు.

సంక్రాంతి సంబరాలు



తిరువూరు: సంక్రాంతి విశిష్టతను విద్యార్థులకు వివరిస్తూ తిరువూరు శ్రీనిధి స్కూల్లో మంగళవారం పలు కార్యక్రమాలు నిర్వహించారు. బాలబాలికలు, ఉపాధ్యాయులు సంప్రదాయ వస్త్రధారణతో అలరించారు. భోగిమంటలు, గంగిరెద్దు ఆటలు, హరిదాసు కీర్తనలతో సంక్రాంతి సంబరాలు జరిపారు. తిరువూరు సీఐ అబ్దుల్ నబీ ముఖ్య అతిథిగా విచ్చేసి చిన్నారులకు భోగిపళ్లు పోశారు. పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్ వెంకటనారాయణ, కరస్పాండెంటు కిషోర్ పాల్గొన్నారు.

సచివాలయ వ్యవస్థతో ప్రజల వద్దకే పాలన

ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణప్రసాద్



వెంకటాపురంలో గ్రామ సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్

జి.కొండూరు: గ్రామ సచివాలయ వ్యవస్థతో ప్రజల వద్దకే పాలనను చేర్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణప్రసాద్ అన్నారు. మండలంలోని వెంకటాపురం గ్రామంలో రూ.43.60లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని ఎమ్మెల్యే మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎటువంటి వివక్షకు తావులేకుండా అర్హతే ప్రామాణికంగా ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడంలో సచివాలయ వ్యవస్థతో పాటు గ్రామ వలంటీరు వ్యవస్థ కీలకపాత్ర పోషిస్తుందన్నారు. ఈ రెండు వ్యవస్థల వలన సంక్షేమం, అభివృద్ధి సమాంతరంగా జరుగుతుందన్నారు. ఈ రెండు వ్యవస్థల ఏర్పాటుతో గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం ఆంధ్రప్రదేశ్‌లో అమలవుతుందన్నారు.

గడపగడప నిధులతో రోడ్డు నిర్మాణం



తిరువూరులో సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ కస్తూరిబాయి

తిరువూరు: తిరువూరు నగరపంచాయతీలోని పలు వార్డుల్లో గడపగడపకు మన ప్రభుత్వం నిర్వహించినపుడు గుర్తించిన సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం నిధులు విడుదల చేసినట్లు చైర్‌పర్సన్ గత్తం కస్తూరిబాయి తెలిపారు. మంగళవారం 17వ వార్డులో రూ.10లక్షలతో చేపట్టిన సీసీ రహదారి పనులను ఆమె ప్రారంభించారు. అన్ని వార్డుల్లో రహదారుల అభివృద్ధికి నిధులు కేటాయిస్తున్నట్లు వెల్లడించారు. వైస్ చైర్‌పర్సన్ గుమ్మా కోటేశ్వరి, వార్డు కౌన్సిలర్లు పరసా శ్రీనివాసరావు, షేక్ హుసేన్, గుంటూరు మస్తాన్, వైఎస్సార్ సీపీ నాయకులు జాకీర్, ఆదినారాయణ, శోభనం, చలమాల సత్యనారాయణ, రాజ్ మహ్మద్ పాల్గొన్నారు.

నూతన పింఛన్ల పంపిణీ



గంపలగూడెం: మండలంలోని పలు గ్రామాలలో జనవరిలో మంజూరైన 139 నూతన పింఛన్ల పంపిణీ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఊటుకూరు, వినగడప, పెద్దకొమిర, తోటమూల, అమ్మిరెడ్డిగూడెం తదితర గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచ్‌లు ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్ సీపీ నాయకులు లబ్ధిదారులకు పింఛన్ల నగదు అందజేశారు.

సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

ఎంపీపీ లక్ష్మీతిరుపతమ్మ

జి.కొండూరు: అభివృద్ధిలో ఎటువంటి వివక్షకు తావులేకుండా ప్రతి సమస్యపైనా ప్రత్యేక దృష్టి సారించి పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు ఎంపీపీ వేములకొండ లక్ష్మీతిరుపతమ్మ అన్నారు. స్థానిక కమ్యూనిటీ హాల్లో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ వేములకొండ లక్ష్మీతిరుపతమ్మ అధ్యక్షతన మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ప్రవేశపెట్టిన 37.77లక్షల మండల పరిషత్ బడ్జెట్‌ను సభ్యులు తీర్మానించారు. ఎంపీపీ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మండల పరిషత్ నిధులు రూ.1.77 కోట్లతో మండల పరిధిలో అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టి పూర్తిచేసినట్లు చెప్పారు. గ్రామాల్లో ఎటువంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకొస్తే వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు మందా జక్రధరరావు, ఏఎంసీ చైర్మన్ అప్పిడి సత్యనారాయణరెడ్డి, ఎంపీడీఓ అనురాధ పాల్గొన్నారు.

గోదాదేవికి ముత్యాలహారతి

తిరువూరు: ధనుర్మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం తిరువూరులోని పలు ఆలయాల్లో ముత్యాల హారతి కార్యక్రమం నిర్వహించారు. వైష్ణవ సంప్రదాయానుసారం తిరుప్పావై పఠిస్తూ గోదాదేవికి ఈ హారతి సమర్పించారు. ఎన్‌సీహెచ్ విఠలాచార్యులు ఆధ్వర్యంలో వెంకటాచలస్వామి ఆలయం, రాజ్యలక్ష్మీ సమేత రంగనాథస్వామి ఆలయం, కోదండ రామాలయం, రాజుపేట వీరాంజనేయస్వామి దేవస్థానాల్లో విశేష పూజలు నిర్వహించారు.

మామిడిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



నరసింహారావుపాలెంలో రైతులకు సూచనలిస్తున్న ఉద్యానవన శాఖాధికారి హేమ

చాట్రాయి: మామిడి సాగులో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఉద్యానవన శాఖాధికారి హేమ తెలిపారు. మండలంలోని నరసింహారావుపాలెం, చాట్రాయి గ్రామాల్లో మామిడి సాగును ఆమె మంగళవారం పరిశీలించి మాట్లాడారు. ప్రస్తుతం మామిడి పూత దశలో ఉందని, పూతరాని చెట్లకు 10 గ్రాముల మల్టీ కెని ఒక లీటరు నీటిలో పిచికారీ చేయాలని తెలిపారు. 2 గ్రాముల బోరాన్, 2 గ్రాముల జింకుని ఒక లీటరు నీటిలో పిచికారీ చేయాలని రైతులకు సూచించారు. పూత వచ్చిన తోటల్లో పచ్చి పూత మీద తేనే మంచు పురుగు నివారణకు 1.5 లీటర్ల ఎసిఫేట్ లీటరు నీటిలో, లేదా 0.5 మిల్లీ లీటర్ల ఇమిడా క్లోప్రిడ్ లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని ఆమె సూచించారు.

కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు

డీఎస్పీ అశోక్‌కుమార్



నూజివీడు డీఎస్పీ అశోక్‌కుమార్

నూజివీడు: సంక్రాంతిని పురస్కరించుకుని నూజివీడు పోలీసు సబ్ డివిజన్‌లో కోడి పందేలు, పేకాట నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ ఈడే అశోక్‌కుమార్ హెచ్చరించారు. నూజివీడులో మంగళవారం ఆయన మాట్లాడుతూ పండగ రోజుల్లో సంప్రదాయం పేరుతో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికే కోడి పందేల నిర్వాహకులు, కోడి కత్తుల తయారీదారులు కలిపి 398 మందిని బైండోవర్ చేశామన్నారు. గతంలో కోడి పందేలు, పేకాట, నిర్వహించిన ప్రదేశాలు, నిర్వాహకులపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. నూజివీడు సబ్ డివిజన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజలు పోలీస్ శాఖకు సహకరించాలని, దీని వలన ప్రజలకు మెరుగైన సేవలను పోలీస్ శాఖ అందించగలదని డీఎస్పీ చెప్పారు.

మైలవరంలో..

మైలవరం: సంక్రాంతిని పురస్కరించుకుని కోడి పందేలు నిర్వహించడం, చట్ట వ్యతిరేకమైన ఆటలు ఆడించిన వారిపై చట్ట రీత్యా చర్యలు తీసుకుంటామని మైలవరం డివిజన్ ఏసీపీ ఎం.రమేష్ తెలిపారు. విజయవాడ సీపీ, డీసీపీ ఆదేశాల మేరకు మైలవరంలోని ఏసీపీ కార్యాలయంలో మంగళవారం పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. మైలవరం డివిజన్ పరిధిలో ఎక్కడైనా కోడి పందేలు బిరులు ఏర్పాటు చేసిన, కోడి పందేలు నిర్వహించినా సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పొలాలు, మామిడి తోటలు, ఖాళీ స్థలాలు కోడి పందేల నిర్వహణకు ఇవ్వకూడదని సూచించారు. రెవెన్యూ అధికారులు, ఎన్‌జీఓలు పోలీస్ వారికి సహకరించాలని కోరారు.

జూదాలు నిర్వహిస్తే చర్యలు

తిరువూరు: సంక్రాంతి జూదాలు నిర్వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తిరువూరు సెక్టార్-2 ఎస్ఐ పద్మారావు హెచ్చరించారు. కోడిపందేలు, పేకాట తదితర జూదాలకు పాల్పడే వ్యక్తులను, కోళ్ల కాళ్లకు కత్తులు కట్టేవారిని బైండోవర్ చేస్తామని తెలిపారు.